సంక్షేమ పాలనకే మద్దతివ్వండి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సేవానగర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమాభివృద్ధి పాలనకు ప్రజలు మద్దతివ్వాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. జీవీఎంసీ 6వ వార్డు సేవానగర్, దేవిమెట్ట ప్రాంతంలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఈ ప్రాంతంలో గల బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక, స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అన్ని వర్గాల వారికి మేలు చేసిన వైఎస్సార్ సీపీని రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, సచివాలయ వ్యవస్థ కొనసాగుతాయన్నారు.

కూటమికి ఓటమి తప్పదు

ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు, తాను ఏ గడపకు వెళ్లినా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుడిగా ఆదరిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా వచ్చినా ఓటమి తప్పదన్నారు. ప్రజలకు ఏమి చేస్తారో, ఏమి చేయాలో తెలియని పరిస్థితుల్లో ప్రతిపక్షాలు వున్నాయన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు లేక వెతికే పనిలో వున్నారని ఎద్దేవా చేశారు. అభ్యర్థులను నిర్ణయించుకోలేని ఈ కూటమి ప్రజలకు ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఏదేమైనా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి ప్రజలు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా వున్నారన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, గాదె రోశిరెడ్డి, సియాద్రి కనకరాజు, వంకాయల మారుతీ ప్రసాద్, గుంటుబోయిన సంజీవ్ యాదవ్, పోతిన ఎల్లాజీ, పోతిన హనుమంతరావు, పిల్లా సూరిబాబు, పిల్లా కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమ సారథి సీఎం జగన్

పీఎం పాలెం : ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మెరుగైన పాలన అందించిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా వున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పీఎం పాలెం ఆర్ హెచ్ కాలనీలో కొలువు తీరిన పైడిమాంబ అమ్మవారిని ఆదివారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలు మునుపెన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అవినీతి రహితంగా పొందారన్నారు. ఈ విషయంలో ప్రతిపక్షాల నాయకులు సైతం ప్రభుత్వాన్ని అభినందించిన ఉదంతాలు ఎన్నో వున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీ లక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గాదె రోశిరెడ్డి, శ్రావణ్, పార్టీ ఆరో వార్డు అధ్యక్షురాలు కె.వరలక్ష్మి, పోతిన సూరిబాబు, జామి శివకుమార్, గాయత్రినగర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పీఎం పాలెంలో పైడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

క్లుప్తంగా

సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు



మధురవాడలో పూజలందుకున్న సూర్యభగవానుడు

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు మధురవాడ జంక్షన్ వద్ద గల సిద్దేశ్వర స్వామి పీఠంలోని మండపాకారం, సతీ సమేత నవ గ్రహ ఆలయంలో సూర్య భగవానునికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ఎర్రని వస్త్రాలు, ఎర్రని పూలతో దండలు వేసి ప్రత్యేకంగా అలంకరించారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

60 మందికి కంటి పరీక్షలు

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రిలో ఆదివారం విజయనగరానికి చెందిన వైష్ణవ్ ఐ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో 60 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో పది మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుడు గెద్ద చిరంజీవి, చెల్లూరు సంతోష్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

స్టేజ్ కార్యక్రమాలకు అనుమతి నిరాకరణ

తగరపువలస : సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయంలో ఆదివారం నుంచి జరుగుతున్న వార్షిక ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం వేళ ప్రదర్శించనున్న స్టేజ్ కార్యక్రమాలకు భీమిలి పోలీసులు అనుమతించ లేదు. ఎన్నికల కోడ్ అమలులో వున్నందున ఇక్కడ మూడు రోజులపాటు జరగనున్న సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగమైన పౌరాణిక నాటకాలను నిలిపివేయనున్నట్టు ఆలయ సిబ్బంది తెలిపారు. అలాగే ఏటా అట్టహాసంగా రెండు రోజులపాటు నిర్వహించే బాణసంచా కార్యక్రమానికి సైతం అనుమతి లేదని తెలియచేశారు. మంగళవారం అనుపు రోజు నేల వేషాలకు మాత్రమే అనుమతి వుందన్నారు. భక్తులు ఈ అసౌకర్యానికి సహకరించాలని ఆలయ సిబ్బంది కోరారు.

నేటి నుంచి బంగారమ్మ ఉత్సవాలు



బంగారమ్మ అమ్మవారు

పద్మనాభం : మండలంలోని తునివలస ప్రజల ఆరాధ్య దైవం బంగారమ్మ ఉత్సవాలు సోమవారం తొలేళ్లతో ప్రారంభమవుతాయి. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం అమ్మవారి రథాలు గ్రామంలో ఊరేగిస్తారు. మంగళవారం అమ్మవారి ప్రతిమలను తిప్పుతారు. బుధవారం ముగింపు ఉత్సవం జరుగుతుంది. అమ్మవారి ఆలయానికి, విగ్రహానికి రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

45 మద్యం సీసాలు స్వాధీనం

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఇద్దరిపై ఆదివారం కేసు నమోదు చేశారు. వారి నుంచి 45 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సీహెచ్.శ్రీధర్ తెలిపారు. అక్రమంగా మద్యం అమ్ముతున్నట్టు అందిన సమాచారం మేరకు గంధవరం, పొట్నూరు గ్రామాల్లో సిబ్బందితో కలిసి దాడి చేసినట్టు సీఐ చెప్పారు. ఈ దాడిలో గంధవరంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న కొట్యాడ అప్పారావు నుంచి 30, పొట్నూరులో కంచర్ల పెంటమ్మ నుంచి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

భీమునిపట్నం: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఫణికుమార్ సూచించారు. ఆదివారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో క్షయవ్యాధి ఎంతో ప్రాణాంతకమైందని, సోకితే చనిపోయేవారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చక్కని మందులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఎవరికైనా దగ్గు తగ్గకుండా వస్తే సమీపంలోని ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పరీక్షల్లో వ్యాధి ఉన్నట్టు నిర్ధారణ జరిగితే దానికి అవసరమైన అన్ని మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. అందువల్ల భయపడకుండా తగిన వైద్య సాయం పొంది పూర్తిగా నయం చేసుకోవచ్చని సూచించారు. వైద్యులు, టీబీ యూనిట్ సిబ్బంది ప్రేమ్‌కుమార్, చక్రవర్తి పాల్గొన్నారు.

క్షయ నివారణకు కృషి చేసిన సిబ్బందికి అవార్డులు



డీఎంహెచ్‌వో నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న సాంబమూర్తి



ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న వైద్యురాలు ప్రశాంతి

ఆనందపురం : మండలంలో క్షయ నివారణకు కృషి చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన నలుగురు వైద్య సిబ్బందికి అవార్డులు లభించాయి. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సిబ్బందికి అవార్డులు అందజేశారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గంగునాయుడు తెలిపారు. మండలంలో విస్తృతంగా పర్యటించి క్షయ రోగులను గుర్తించడంతోపాటు సకాలంలో మందులు అందించి వైద్య సేవలు అందించిన సామాజిక ఆరోగ్యాధికారి సాంబమూర్తి, ఎంఎల్‌హెచ్‌పీ సూర్యకళ, ఆరోగ్య కార్యకర్త కుప్ప దేవి, ఆశా కార్యకర్త గంగాభవానీకి జిల్లా వైద్య ఆరోగ్యాధికారి జగదీశ్వరరావు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. ఈ మేరకు వైద్యాధికారులు గంగునాయుడు, షహనాజ్ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

మధురవాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణికి...

మధురవాడ: క్షయ నివారణ, ప్రజలను చైతన్య పరచడం వంటి కార్యక్రమాల్లో మంచి సేవలు అందించినందుకు మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ప్రశాంతికి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఆదివారం ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, డీటీసీవో పూర్ణేంద్రబాబు ఉత్తమ సేవా పురస్కారాన్ని అందించారు. ఆమెకు పురస్కారం లభించడం పట్ల మధురవాడ పీహెచ్‌సీ, ఇతర యూపీహెచ్‌ల వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

మాజీ సైనికులకు సహకరించిన పార్టీకే మద్దతు



సమావేశంలో పాల్గొన్న మాజీ సైనికులు

తగరపువలస : మాజీ సైనికులకు సహకరించిన పార్టీకే వారి కుటుంబాల మద్దతు వుంటుందని శ్రీచైతన్య మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కొయ్య గురయ్య రెడ్డి అన్నారు. ఆదివారం అవంతి కళాశాల - దీవీస్ రహదారిలో గుడివాడ తోగాలమ్మ ఆలయం వద్ద భీమిలి, నెల్లిమర్ల నియోజకవర్గాలకు చెందిన 300 మంది మాజీ సైనికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మాజీ సైనికులకు కమ్యూనిటీ హాలు స్థలం కోసం ఏళ్ల తరబడి వివిధ పార్టీల నాయకుల చుట్టూ తిరుగుతున్నామన్నారు. మాజీ సైనికుల హక్కుల కోసం అండగా నిలబడే వారికే తమ మద్దతు వుంటుందన్నారు. లేదంటే తామే ఇండిపెండెంట్‌గా పోటీ చేసే అవకాశం ఉందన్నారు. సమావేశంలో శ్రీవిఘ్నేశ్వర అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, శ్రీసుత్తమ్మతల్లి అసోసియేషన్ అధ్యక్షుడు సూరిబాబు, జై జవాన్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిశేఖర్ పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో అజయ్ సందడి



లొకేషన్‌లో నటుడు అజయ్

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డులో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. దర్శకుడు కృష్ణ తెరకెక్కిస్తున్న ఓ సినిమాకు సంబంధించి కొన్ని సన్నివేశాలను భీమిలి బీచ్, ఆర్‌కే బీచ్‌లలో నటుడు అజయ్‌పై చిత్రీకరించారు. తిమ్మారెడ్డి గణపతి రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమాలో హీరోగా అశ్విన్ నటిస్తున్నారు.

తర్లువాడలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలతో తర్లువాడ ప్రజలు

ఆనందపురం : మండలంలోని తర్లువాడలో ఆదివారం విజయరాంపురం హిందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జ్ఞాన వేదిక అధ్యక్షుడు కె.త్రినాథరావు మాట్లాడుతూ ఫాల్గుణ మాసంలో వచ్చే పౌర్ణమికి, హోళీకి సారూప్యత వుందన్నారు. భగవద్గీతలో చతుర్వర్ణమును మనుషుల గుణాలు, స్వభావాలు ఆధారంగా తామసులు, రాజసులు, సాత్వికులు, యోగులుగా వర్ణించారని చెప్పారు. ఇక్కడ వర్ణం అంటే మనిషి స్వభావమని, అందులో యోగ, జ్ఞాన మార్గాలు ఎంతో విశిష్టమైనవని, యోగమనే వర్ణమును అందరూ ఆస్వాదించాలన్నారు. ద్వాపర యుగంలో కృష్ణుడు రంగులు చల్లడం అందులో భాగమేనని వివరించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: శిల్పారామంలో వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను అలరించింది. నగరంలోని శ్రీసిద్ధేంద్ర యోగి నాట్యాలయం నిర్వహణలో గణపతి కౌతం నృత్యాంశంతో ప్రారంభించి పలు గీతాలకు అద్భుతంగా నాట్యం చేసి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. కళాకారులు నవ్యశ్రీ, సౌజన్య, శిరీష, మౌనిక, సంజన, చిన్నారి, తదితర 15 మంది పాల్గొన్నారు. సీహెచ్.మోహన లక్ష్మి నృత్య దర్శకత్వం వహించారు కార్యక్రమాన్ని స్థానిక ఏవో విశ్వనాథ రెడ్డి పర్యవేక్షించారు.

అయ్యప్ప జన్మనక్షత్ర వేడుకలు నేడు



శ్రీధర్మ శాస్త్ర సేవాపీఠం

పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో శ్రీ ధర్మ శాస్త్ర సేవా పీఠంలో సోమవారం అయ్యప్ప స్వామి జన్మనక్షత్ర వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం గణపతి పూజ, శ్రీ స్వామి వారి అభిషేక మహోత్సవం, ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి నిర్వహిస్తారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తారు. భక్తులు అభిషేక సామగ్రి సోమవారం ఉదయం 7.30 గంటలలోగా శ్రీ ధర్మ శాస్త్ర సేవా పీఠంలో సమర్పించాలని ప్రతినిధులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం ప్రార్థనలు



మధురవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



ర్యాలీ నిర్వహిస్తున్న చర్చి సంఘ సభ్యులు

మధురవాడ: గుడ్ ఫ్రైడే ముందు వచ్చే ఆదివారాన్ని క్రైస్తవులు మట్టలు ఆదివారంగా పరిగణించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని ట్రినిటి చర్చిలో ఫాస్టర్ రెవరెండ్ ఎస్.ప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. మధురవాడ పరిధిలోని ఇతర చర్చిల్లోనూ ప్రార్థనలు చేశారు. అనంతరం విశ్వాసులు ఈత మట్టలు, కర్జూరపు మట్టలను పూలతో అలంకరించి వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

భీమునిపట్నం: భీమిలిలోని ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి సంఘ సభ్యులు మట్టల ఆదివారం సందర్భంగా ఘనంగా పూజలు నిర్వహించారు. సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ గిడియన్ విజయకుమార్ ఆధ్వర్యంలో సభ్యులు ఏసుక్రీస్తును స్తుతిస్తూ పెద్దబజారు, చిన్నబజారు పాంతాల్లోని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు వై.లివింగ్‌స్టన్, కార్యదర్శి కె.ప్రేమానందరావు, కోశాధికారి డేవిడ్ బెరాక్య, ఉపాధ్యాక్షులు విజయమ్మ రొనాల్డ్, సహాయ కార్యదర్శి జె.డి.ఆనంద్, సహాయ కోశాధికారి ఎం.రామారావు పాల్గొన్నారు.

అపరాధ రుసుముతో ట్రేడ్ లైసెన్స్ ఫీజులు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో డి అండ్ వో ట్రేడ్ లైసెన్స్ ఫీజులు ఈ నెల 31లోగా 25 శాతం అపరాధ రుసుముతో చెల్లించాలని ఏఎంవోహెచ్ శ్రీనివాసరావు కోరారు. ఏప్రిల్ ఒకటి నుంచి 50 శాతం అపరాధ రుసుముతో చెల్లించాల్సి వుంటుందన్నారు. లైసెన్స్ ఫీజులు చెల్లించకుండా కొనసాగే వ్యాపారస్తులకు కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్ నుంచి అనుమతులు రద్దు చేయడానికి సిఫారసు చేయనున్నట్టు హెచ్చరించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఆనందపురం : మండలంలోని గంభీరంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. గంభీరం గ్రామ సమీపాన గెడ్డలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ సీఐ అప్పలనాయుడు, ఆనందపురం సీఐ తిరుపతిరావు సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ మేరకు అక్కడ పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.80 వేలు స్వాధీనం చేసుకున్నారు.

30 మద్యం సీసాలు స్వాధీనం

మండలంలోని శిర్లపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు సీఐ తిరుపతిరావు చెప్పారు. అందిన సమాచారం మేరకు పోలీసులు గ్రామంలో తనిఖీలు చేయగా అక్రమంగా ఓ వ్యక్తి 30 మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశారు.

ఎన్నికల ప్రచారం నేడు

ఆనందపురం : మండలంలోని ముచ్చర్ల, గిడిజాల గ్రామాల్లో సోమవారం ఉదయం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం తెలిపారు. పార్టీ శ్రేణులు ప్రచార కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎన్నికల కోడ్ నిబంధనలు పక్కాగా అమలు



ఎన్నికల అధికారి భాస్కరరెడ్డి

భీమునిపట్నం : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి నిబంధనలు పక్కాగా అమలు చేస్తున్నట్టు ఎన్నికల నిర్వహణ అధికారి ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హులకు అందించే కార్డులపై రాజకీయ పార్టీల నాయకుల బొమ్మలు వుండకూడదని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాల్లో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల ఫొటోలు, పేర్లు వుండకూడదని... ఆ మేరకు అన్ని చోట్ల పరిశీలిస్తున్నామని తెలిపారు. విద్యుత్, నీటితో పాటు ఇతర బిల్లులపై కూడా ఎవరి ఫొటోలూ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, పెట్రోలు బంకుల వద్ద ప్రధాని మోదీ ఫొటోలు, హోర్డింగ్‌లు లేకుండా చూసుకుంటున్నామని తెలిపారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నామని, శిలాఫలకాలనూ కప్పి వుంచుతున్నామన్నారు. కోడ్ అమలు విషయంలో ఎంతో అప్రమత్తంగా వున్నామని వెల్లడించారు.

అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ వేగవంతం చేయాలి

తగరపువలస : అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు భీమిలి రెవెన్యూ పరిధిలో నత్తనడకన సాగుతోందని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. నిత్యం వీటి కోసం వందలాది మంది రైతులు భీమిలి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దీనికి సంబంధించి లావాదేవీలు తాము పూర్తి చేసి కలెక్టరేట్‌కు పంపించినట్టు భీమిలి రెవెన్యూ సిబ్బంది చెపుతున్నట్టు రైతులు అంటున్నారు. గతంలో జేసీగా విశ్వనాథన్ వున్నంతవరకు అసైన్డ్ భూములకు సంబంధించిన క్రమబద్ధీకరణ పనులు వేగవంతంగా పూర్తయ్యేవని... తర్వాత నెమ్మదించాయని భీమిలి మండలానికి చెందిన రైతులు అంటున్నారు. కలెక్టరేట్‌కు వెళ్లి కొందరు రైతులు తమ పనులు చేయించుకున్నప్పటికీ... అంతవరకు వెళ్లలేని వారు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడడంతో రెవెన్యూ సిబ్బంది అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ పనులు పూర్తి చేయలేకపోతున్నారని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం 50 ఎకరాల వరకు అసైన్డ్ భూముల ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేసి తమకు లబ్ధి చేకూర్చాలని భీమిలి మండల రైతులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్ నిర్వాకంతో సంగివలస వాసులకు అవస్థలు



ధూళి రేగిపోతున్న సంగివలస - పాండ్రంగి రహదారి

తగరపువలస: జాతీయ రహదారిని ఆనుకుని సంగివలస నుంచి పాండ్రంగి వెళ్లే రహదారిపై ఎర్రటి ధూళి చెలరేగడంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నారు. పద్మనాభం మండలం సామియ్యవలస పంప్ హౌస్ నుంచి సంగివలస మీదుగా ఇటీవల పైప్‌లైన్ కోసం బీటీరోడ్డును తవ్వి వదిలేశారు. తర్వాత పైప్‌లైన్ కోసం తీసిన గోతులు సరిగా పూడ్చకపోవడంతో ఎత్తుపల్లాలుగా మిగిలిపోయింది. ఇటీవల కురిసిన వర్షానికి ఈ మార్గం చిత్తడిగా మారిపోయింది. ప్రస్తుతం వాహనాల రాకపోకలతో రేగిన ఎర్ర రేణువుల కారణంగా ఈ మార్గంలో ఇరువైపులా నివసిస్తున్న వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పంట భూములు ఎర్రగా మారిపోతున్నాయి. రహదారి పునర్నిర్మించే వరకు పైప్‌లైన్ కోసం తీసిన గోతులను డెబ్రిస్‌తో పూడ్చి ఉపశమనం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. మంగళవారం ఈ మార్గంలో అమ్మవార్ల అనుపోత్సవం సందర్భంగా రథోత్సవం, ఇతర నేలవేషాల ప్రదర్శన వుంటుందని... ఆలోగా లోపాలు సవరించాలని స్థానికులు కోరుతున్నారు.